# ఇంటర్ పరీక్షల షెడ్యూల్లో మార్పులు

### మే 24 నుంచి జూన్ 3 వరకు పరీక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్లో స్వల్పమార్పులు చోటుచేసుకున్నాయి. తొలుత ప్రకటించిన షెడ్యూల్‌ను ఇంటర్‌బోర్డు సవరించింది. మొదట మే 24 నుంచి జూన్ 1 వరకు పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించగా, తాజాగా మే 24నుంచి జూన్ 3వరకు నిర్వహిస్తామని ఇంటర్‌బోర్డు ప్రకటించింది. పూర్తి షెడ్యూల్‌ను శనివారం విడుదల చేసింది. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2:30నుంచి సాయంత్రం 5:30వరకు సెకండియర్ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రాక్టికల్ ఎగ్జామ్స్ జూన్ 4నుంచి 8వరకు నిర్వహిస్తారు. ఫస్టియర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్ ఎగ్జామ్ జూన్ 10న ఉదయం 9గంటలకు నిర్వహిస్తారు. జూన్ 11న ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ ఎగ్జామ్, 12న ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ ఎగ్జామ్ నిర్వహిస్తారు.

#### ఫస్టియర్ టైం టేబుల్

| | | |
|---|---|---|
| మే 24 | – | సెకండ్ లాంగ్వేజ్ పేపర్–1 |
| మే 25 | – | ఇంగ్లిష్ పేపర్–1 |
| మే 28 | – | గణితం పేపర్–1ఏ, బోటనీ పేపర్ –1, పొలిటికల్ సైన్స్ పేపర్ –1 |
| మే 29 | – | గణితం పేపర్ –1బీ, జువాలజీ పేపర్ –1, హిస్టరీ పేపర్ –1 |
| మే 30 | – | ఫిజిక్స్ పేపర్ –1, ఎకానమిక్స్ పేపర్ –1 |
| మే 31 | – | కెమిస్ట్రీ పేపర్ –1, కామర్స్ పేపర్ –1 |
| జూన్ 1 | – | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్ –1, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్ పేపర్ –1 (బైపీపీ విద్యార్థులకు) |
| జూన్ 3 | – | మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్ –1, జియోగ్రఫీ పేపర్ –1 |

#### సెకండియర్ టైం టేబుల్

| | | |
|---|---|---|
| మే 24 | – | సెకండ్ లాంగ్వేజ్ పేపర్ –2 |
| మే 25 | – | ఇంగ్లిష్ పేపర్ –2 |
| మే 28 | – | గణితం పేపర్–2ఏ, బోటనీ పేపర్ –2, పొలిటికల్ సైన్స్ పేపర్ –2 |
| మే 29 | – | గణితం పేపర్–2బీ, జువాలజీ పేపర్ –2, హిస్టరీ పేపర్ –2 |
| మే 30 | – | ఫిజిక్స్ పేపర్ –2, ఎకానమిక్స్ పేపర్ –2 |
| మే 31 | – | కెమిస్ట్రీ పేపర్ –2, కామర్స్ పేపర్ –2 |
| జూన్ 1 | – | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్ –2, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్ పేపర్ –2 (బైపీపీ విద్యార్థులకు) |
| జూన్ 3 | – | మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్ –2, జియోగ్రఫీ పేపర్ –2 |

# బీదర్ రైల్వే లైన్ పూర్తిచేయిస్తా

- **యువత కోసం జాబ్ మేళాలు**
- **మోసాలకు కేరాఫ్ కాంగ్రెస్**
- **రైతులను కష్టాలు చుట్టుముట్టినయ్**
- **నమ్మకం లేనోళ్లే దేవుళ్లపై ఒట్లేస్తరు**
- **జహీరాబాద్‌లో గెలుపు బీఆర్‌ఎస్‌దే**
- **'నమస్తే' ఇంటర్వ్యూలో గాలి అనిల్‌కుమార్**

నిజామాబాద్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'గత ఎంపీలు అభివృద్ధిని పక్కనబెట్టి సొంత లాభం, కాంట్రాక్టుల కోసమే పనిచేసింద్రు. ప్రజా సమస్యలపై ఎన్నడూ పార్లమెంట్‌లో మాట్లాడింది లేదు. జహీరాబాద్‌కు జాతీయ రహదారులతో పాటు రైల్వే కనెక్టివిటీని పెంచాల్సి ఉన్నది. బీదర్ టు బోధన్ రైల్వే లైన్ పూర్తిచేయాలి. నేను ఎంపీగా గెలిస్తే తప్పక సాధిస్తా' అని జహీరాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ చెప్పారు. శనివారం 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన, యువతకు పెద్ద సంఖ్యలో జాబ్‌మేళాలు పెట్టి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అంటేనే మోసాలకు కేరాఫ్ అని, రాష్ట్రంలో రైతులను కష్టాలు చుట్టుముట్టాయని ఆవేదన వ్యక్తంచేశారు.

***ఆగస్టు 15లోగా గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ అంటున్నది. దీనిపై మీ అభిప్రాయం?***

దేవుళ్లపై ఒట్లు.. కేసీఆర్‌పై తిట్లు తప్ప కాంగ్రెస్ చేసేదేం ఉండదు. ప్రచారంలో కేవలం దూషణలు, ఒట్లతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మభ్యపెడుతున్నడు. ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేసి ఉంటే దేవుళ్లపై ఒట్లు పెట్టే అవసరం రాదు.. నమ్మకం లేకనే ఇలా ఒట్లు పెడుతున్నరు. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అసంబద్ధమైన హామీలు గుప్పించి ప్రజలను గందరగోళంలో పడేసి ఓట్లు వేయించుకున్నాక చేతులెత్తేసిన్రు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నారని తెలిసే సీఎం రేవంత్‌రెడ్డి అనైతిక రాజకీయాలకు పాల్పడుతున్నడు. రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ, వరికి రూ.500 బోనస్, మహిళలకు నెలకు రూ.2,500, పింఛన్ రూ.4వేలు ఇస్తామని చెప్పి ఐదు నెలలవుతున్నా అమలు చేయకపోవడం వారి చేతగాని తనానికి నిదర్శనం. మోసం చేయడంలో రేవంత్‌ను మించినోళ్లు లేరు.

**ఎన్నికల ప్రచారంలో నాయకుల తోడ్పాటు, ప్రజల స్పందన ఎలా ఉంది?**

లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల సహకారంతో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాం.. మా పార్టీ అధినేత కేసీఆర్ మార్గదర్శకంలో ప్రచారం జోరుగా నడుస్తున్నది. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అండదండలు, ఎమ్మెల్యే మాణిక్ రావు, ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్ షిండే, జాజాల సురేందర్, క్రాంతి, భూపాల్ రెడ్డి, కార్యకర్తలంతా కలిసి పార్టీ విజయం, నా గెలుపు కోసం సైనికుల్లా పనిచేస్తున్నరు. ప్రచారంలో ప్రజలను కలిసినప్పుడు వారి కళ్లలో బాధ కనిపిస్తున్నది. కేసీఆర్‌ను అనవసరంగా ఓడగొట్టుకున్నామనే భావన వినిపిస్తున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాదనుకోలేదని వాళ్లంతా చెప్తున్నరు. ఈసారి మాత్రం కేసీఆర్‌కే మద్దతుగా నిలుస్తామని తెగేసిచెప్తున్నరు. రైతులైతే ఎప్పుడో డిసైడయ్యింద్రు. కేసీఆర్ ఉన్నప్పుడు మాకు బాధ అన్నదే తెల్వలేదు, కాంగ్రెస్ పాలకులు నరకం చూపిస్తున్నరని ఆవేదన చెందుతున్నరు. వాస్తవాలను రైతులు, సామాన్యులు గుర్తిస్తున్నరు. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్తరు.

**మీరు గెలిస్తే ఏమేం పనులు చేస్తారు?**

**ఇంతకు ముందు పనిచేసిన ఎంపీలు జహీరాబాద్ సమస్యలపై ఏనాడూ పార్లమెంట్‌లో మాట్లాడలేదు. వారి వ్యాపారాలను పెంచుకున్నారే తప్ప ఎలాంటి అభివృద్ధి పనులూ చేయలేదు. తెలంగాణ మేలు కోరే బీఆర్‌ఎస్ ఎంపీలు ఉంటేనే రాష్ట్రానికి దక్కాల్సిన హక్కులు దక్కుతాయి. ప్రజలు ఆశీర్వదించి నన్ను పార్లమెంట్‌కు పంపిస్తే బీదర్ టు బోధన్ రైల్వే లైన్‌ను పూర్తి చేయిస్తా. జహీరాబాద్ నియోజకవర్గంలోని ప్రతి మండలానికి జాతీయ రహదారితో కనెక్టివిటీ పెంచడం నా ప్రధాన ఎజెండా. ఎంపీగా గెలిచాక సొంత నిధులతో పెద్ద సంఖ్యలో జాబ్ మేళాలు పెట్టి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తా.**




**గత ఎంపీలు ప్రజలకు అందుబాటులో ఉండలేదన్న విమర్శలున్నాయి. మరి మీరు?**

నిరంతరం ప్రజల్లోనే ఉండి వారి సాధకబాధకాలను పంచుకుంట. ప్రజలకు సేవ చేసే ఉద్దేశంతోనే కేసీఆర్ స్ఫూర్తితో రాజకీయాల్లో వచ్చా. ప్రజల మద్దతుతో గెలిచిన వారికి ఏ కష్టం వచ్చినా తోడుంట. జహీరాబాద్ ప్రజలను నా కుటుంబ సభ్యుల్లా చూసుకుంటా. గతంలో పని చేసిన ఎంపీల గురించి మాట్లాడుకోవడం వృథా. ఎన్నికలప్పుడే ప్రజల ముందు కొచ్చేవాళ్లను ప్రజలు తిరస్కరిస్తారు. సురేశ్ షెట్కార్, బీబీపాటిల్‌ను ఈ ప్రాంత ప్రజలు ఆదరించినా వారు నిలబెట్టుకోలేదు. పదేండ్ల పాటు ఎంపీగా ఉన్న బీబీ పాటిల్‌కు ఇప్పటికీ ఏ ఊరు ఎక్కడుందో తెలియదు. పదవిని అడ్డం పెట్టుకుని పబ్బం గడపడం మినహా ప్రజలకు వాళ్లు చేసిన మేలేం లేదు. నిరంతరం ప్రజల్లో ఉండే నాకు వాళ్లు పోటీయే కాదు.

# ఎప్‌సెట్‌లో ఫేషియల్ రికగ్నిషన్!

- **తొలిసారి అమలుకు సన్నాహాలు**
- **ఒకరికి బదులుగా మరొకరు పరీక్ష రాయడం కుదరదిక**
- **రేపటి నుంచి అందుబాటులో హాల్‌టికెట్లు**

హైదరాబాద్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ): ఒకరికి బదులుగా మరొకరు పరీక్ష రాయడాన్ని అరికట్టేందుకు.. ఈ ఏడాది ఎప్‌సెట్ పరీక్షల్లో ముఖ ఆధారిత గుర్తింపు విధానాన్ని (ఫేషియల్ రికగ్నిషన్) అమలుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతానికి టెస్టింగ్స్ నిర్వహిస్తుండగా, అంతా సవ్యంగా ఉంటే ఈ ఏడాదే అమలు చేయనున్నారు. లేదంటే వచ్చే ఏడాది నుంచి ఈ విధానం తప్పనిసరిగా అమలవుతుంది.

**నేడు నిపుణుల సమక్షంలో టెస్ట్**

ఎప్‌సెట్‌లో ఇప్పటివరకు బయోమెట్రిక్ హాజరు తీసుకుంటున్నారు. కుడి చేతి బొటనవేలి ముద్రను కూడా తీసుకుంటారు. ఈసారి వీటితో పాటు ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ విధానంలో దరఖాస్తు సమయంలో విద్యార్థి అప్‌లోడ్ చేసిన ఫొటోను, పరీక్షకు వచ్చినప్పుడు క్యాప్చర్ చేసిన ఫొటోను రెండింటిని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పరిశీలిస్తారు. ఇందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తారు. విద్యార్థి పోలికలు సరిపోతేనే సాఫ్ట్‌వేర్ ఆయా విద్యార్థిని పరీక్షకు అనుమతిస్తుంది. దీంతో పరీక్షకు వచ్చిన వారు అసలు విద్యార్థియా? లేక నకిలీ విద్యార్థా? అన్నది ఇట్టే తేలిపోతుంది. ఈ విధానాన్ని అమలుచేసేందుకు ఆదివారం నిపుణుల సమక్షంలో టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ ట్రయల్స్ తర్వాత అమలుచేయాలా? వద్దా అన్నది నిర్ణయిస్తారు. ఈ ఏడాది ఎప్‌సెట్‌కు 3.5లక్షలకుపైగా దరఖాస్తులొచ్చాయి. ఇంజినీరింగ్‌కు 2.5లక్షలు, అగ్రికల్చర్, ఫార్మసీకి 98వేల మంది దరఖాస్తు చేసుకొన్నారు. మే 7, 8న అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ, మే 9, 10, 11న ఇంజినీరింగ్ విభాగానికి పరీక్షలు జరగనున్నాయి. సోమవారం ఉదయం నుంచే హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

## • రామానంద తీర్థలో వేసవి శిబిరం



*బేగంపేట్ బ్రాహ్మణవాడిలోని స్వామి రామానందతీర్థ ప్రాంగణం పీవీ స్మారక భవనంలో మే 1 నుంచి వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించనున్నట్టు రామానంద తీర్థ ఇన్‌చార్జి చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ సురభివాణిదేవి తెలిపారు. పాటలు, యోగా, డ్యాన్స్ తదితర అంశాల్లో చిన్నారులకు నెల రోజుల పాటు శిక్షణ అందించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రామానంద తీర్థ కమిటీ భవన్‌లో సంప్రదించాలని సూచించారు.*

*–బేగంపేట్*

## టెట్‌ను వాయిదా వేయండి


హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక నేపథ్యంలో మే 20 నుంచి జూన్ 3 వరకు జరగాల్సిన టెట్ పరీక్షలను వాయిదావేయాలని టెట్ అభ్యర్థులు, ఓటర్లు శనివారం ఎన్నికల కమిషన్‌కు లేఖలు రాశారు. పరీక్షలు నిర్వహిస్తే 70వేల మంది ఓటు హక్కు కోల్పోయే ప్రమాదమున్నదని ఆయా లేఖల్లో ప్రస్తావించారు. టెట్‌ను వాయిదావేయాలని అభ్యర్థి రావుల రామ్మోహన్‌రెడ్డి ఈసీని కోరారు.

## 'జేఎన్టీయూ వీసీపై చర్యలు తీసుకోవాలి'

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి గుట్టుచప్పుడు కాకుండా కార్యాలయాలను ప్రారంభిస్తున్న జేఎన్టీయూ వీసీపై చర్యలు తీసుకోవాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మారపు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్, సీఎస్ శాంతికుమారి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంకు వినతిపత్రాలు అందజేశారు.

## సీనియర్ జర్నలిస్ట్ వినయ్ వీర్‌జీ కన్నుమూత

### సంతాపం ప్రకటించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్



జూబ్లీహిల్స్, ఏప్రిల్ 27: ప్రముఖ జర్నలిస్ట్, హిందీ మిలాప్ సంపాదకుడు వినయ్ వీర్‌జీ (72) కన్నుమూశారు. హైదరాబాద్‌లోని నిజాం కాలేజీలో చదివిన ఆయన.. హిందీ భాషోన్నతికి విశేషంగా కృషి చేశారు. లండన్‌లో ఉన్నత విద్యాభాసం అనంతరం దక్షిణాదిలో హిందీ జర్నలిజం అభ్యున్నతికి పాటుపడ్డారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు యుధ్‌వీర్ కుమారుడు ఈయన. తండ్రి మరణాంతరం యుధ్‌వీర్ ఫౌండేషన్ స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. ఫొటో జర్నలిస్టుగానూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. జూబ్లీహిల్స్‌లోని విస్పర్ వ్యాలీలో ఆదివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. వినయ్ వీర్‌జీ మరణం పట్ల బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. జాతీయస్థాయి జర్నలిస్టుగా ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## శ్రీదేవి ప్రసాద్‌కు యుధ్‌వీర్ అవార్డు

హైదరాబాద్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ): శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శ్రీదేవి ప్రసాద్ ప్రతిష్ఠాత్మకమైన 31వ యుధ్‌వీర్ పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రత్యేక అవసరాలు గల వారికి నాణ్యమైన పునరావాస సేవలందించడం కోసం నిర్విరామంగా చేస్తున్న కృషికి గుర్తింపునకు యుధ్‌వీర్ మెమోరియల్ ఫౌండేషన్ ఆమెను ఈ అవార్డు కోసం ఎంపికచేశారు. ఈ నెల 30న కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

